మురుగు గుంతలో ఆయిల్ బాల్స్ వేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి అర్బన్, జూలై 12 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కె.గంగాధర్ జిల్లా ఆసుపత్రి వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆసుపత్రిని ఆయన సందర్శించి వార్డులు, పరిసరాలను పరిశీలించారు. పేషంట్లను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటిని అందించాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డికి సూచించారు. అనంతరం పట్టణంలోని సర్దార్ నగర్‌ను పరిశీలించి వార్డులో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు వార్డులోని మురుగు గుంతలో ఆయిల్ బాల్స్ వేశారు. ఆయన వెంట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లికార్జున్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలి : డీపీఓ

అమ్మనబోలులో నిల్వ నీటిని పారబోయిస్తున్న డీపీఓ సునంద

మోటకొండూరు, జూలై 12 : గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని డీపీఓ సునంద అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని అమ్మనబోలు, ఇక్కుర్తి, మాటూరు గ్రామాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిశుభ్రత చాలా ముఖ్యమని, పారిశుధ్య చర్యలను పక్కాగా నిర్వహించి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీఓ కిషన్, పంచాయతీ కార్యదర్శులు అశోక్, మల్లేశం పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు డ్రై డే పాటించాలి : ఎంపీడీఓ

భువనగిరి కలెక్టరేట్ : బొల్లేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు

భువనగిరి కలెక్టరేట్, జూలై 12 : దోమల వ్యాప్తిని అరికట్టేందుకు శుక్రవారం డ్రై డేగా పాటించాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు సూచించారు. ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. ఎంపీఓ అనూరాధాదేవి, బొల్లేపల్లి ఆరోగ్య ఉప కేంద్రం వైద్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు సన్మానం

ప్రీతమ్‌కు సన్మానం చేస్తున్న నాయకులు, చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, జూలై 12 : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరిగారి ప్రీతమ్ శుక్రవారం సంక్షేమ భవనంలో బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డితోపాటు పాలకవర్గ సభ్యులు, పార్టీ నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా ప్రీతంను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు రామచంద్రు, నాయకులు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, కారుపోతుల వెంకన్న పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని ధర్నా

ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట (వలిగొండ), జూలై 12 : మండలంలోని సుంకిశాల నుంచి మెగా గ్యాస్ కంపెనీ వరకు ధ్వంసమైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మెగా కంపెనీ వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ బీటీ పూర్తిగా ధ్వంసమై ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేసి ప్రయాణికుల ఇక్కట్లను తొగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కిష్టయ్య, బాలయ్య, జంగయ్య, సత్తిరెడ్డి, పెద్ద స్వామి, బొందయ్య, సత్యం, రాములు, మల్లేశం, ఎల్లయ్య, నర్సింహ, రాములు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

మోత్కూరు : బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించిన పాఠశాల ఉపాధ్యాయులు

మోత్కూరు, జూలై 12 : మండలంలోని పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం వీడ్కోలు సన్మాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు అగ్గిరాములు, ఉపాధ్యాయులు టి.ఉప్పలయ్య, ఎ.రామానుజులమ్మ, సీహెచ్ స్వప్న, కె.నాగలక్ష్మి, బి.వీరాచారి, పసునూరి కృష్ణ, వి.నరేశ్‌ను సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మిర్యాల దామోదర్ మాట్లాడుతూ ఎంతో కాలంగా పాఠశాలలో పని చేసి విద్యార్థుల అభిమానాన్ని చూరగొన్న ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని ఉద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.లింగమల్లు, దర్శనం వెంకన్న పాల్గొన్నారు.

దూదివెంకటాపురంలో..

రాజాపేట : మండలంలోని దూదివెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విశ్వరూపం, జితేందర్, రీటాకుమారిని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సన్మానించి వీడ్కోలు పలికారు. పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు విజయలక్ష్మి, చింతల కనకయ్య, నరసింహాచారి, రవీందర్, వెంకటేశం, శ్రీనివాస్, ఎలేందర్ రెడ్డి, మధు, రాజేశ్వరిని సన్మానించి స్వాగతం పలికారు.

శాస్త్రోక్తంగా సుదర్శన నారసింహ హోమం



కారుమబ్బుల్లో ప్రధానాలయం, స్వామివారి దర్శనం కోసం బారులు దీరిన భక్తులు

యాదగిరిగుట్ట, జూలై 12 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సుదర్శన నారసింహ హోమం శాస్త్రోక్తంగా జరిగింది. శుక్రవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలోని కల్యాణ మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హవనం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. లక్ష్మీ సమేతుడైన నారసింహస్వామిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరుకల్యాణ తంతు జరిపారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ప్రధానాలయం ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా భక్తులతో సువర్ణపుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ జరిపారు. ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారిని పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాలు, వజ్రాభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించి ఊంజల్ సేవలో తీర్చిదిద్ది తిరువీధుల్లో ఊరేగించారు. అద్దాల మండపంలో వేదమంత్ర పఠనాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన విధ్వాంసులు మంగళ వాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల నడుమ ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలు స్మార్తగమశాస్త్రరీతిలో జరిగాయి. 9వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. రూ.28,20,554 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహ మూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

19న ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

బీబీనగర్, జూలై 12 : మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19న ఉపాధి హామీ పనులపై 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 4 నుంచి 2024 మార్చి 31వరకు చేసిన పనులకు సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహిస్తుందని తెలిపారు. అనంతరం 19న జరిగే సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రామన్నపేట (వలిగొండ), జూలై 12 : మండలంలోని టేకులసోమారం గ్రామంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకులసోమారం గ్రామానికి చెందిన చేగూరి శ్రీనివాస్(45)కు ఒక కుమార్తె, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రెండు సంవత్సరాల క్రితం బిడ్డ పెండ్లి కోసం సుమారు రూ.5లక్షల వరకు అప్పు చేశాడు. అప్పులు పెరిగిపోవడం, తిరిగి చెల్లించే పరిస్థితి లేకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరి వేసుకున్నాడు. భార్య అరుణ, కొడుకు ప్రసాద్ వచ్చి చూసేసరికి విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

రామన్నపేట, జూలై 12 : ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి ఆభరణాలను దొంగిలించిన ఇద్దరిని రామన్నపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన లవణం ఇందిర ఈ నెల 7న చిట్యాల నుంచి రామన్నపేటకు ఆటోలో వస్తుండగా.. తన బ్యాగ్‌లో ఒక పెట్టెలో దాచిన చెవికమ్మలు, కాళ్ల పట్టీలను అదే ఆటోలో ఎక్కిన ఇద్దరు దొంగిలించి రామన్నపేట శివారులో దిగిపోయారు. గమనించిన బాధితురాలు రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం కొమ్మాయిగూడెం రైల్వే బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో వెళ్తున్న కర్నూలు జిల్లా దోన మండలం చిగురుమానుపేట గ్రామానికి చెందిన కావటి గంగరాజు, కావటి తులసి అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఆభరణాలు దొంగిలించినట్లు అంగీకరించారు. వారిని కోర్టులో హాజరు పరుచగా జడ్జి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

మేకల దొంగలకు జరిమానా

రామన్నపేట, జూలై 12 : మోత్కూరు మండలం బుజిలాపురంలో మేకపోతుల దొంగతనం కేసులో యాదాద్రి భువనగిరి జిల్లా ముసిపట్ల గ్రామానికి చెందిన బాషపాక పురుషోత్తం, శాకపురం నవీన్‌ను 2022లో పోలీసులు అరెస్టు చేశారు. వారిని రామన్నపేట కోర్టులో ప్రవేశపెట్టి దొంగతనానికి సంబంధించిన సాక్ష్యాలను అందించారు. దీంతో విచారణ చేపట్టిన ప్రిన్స్‌పల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ఒక్కొక్కరికి ఆరు వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

యూఎస్‌సీ నంబర్ అప్‌డేట్ కోసం ప్రత్యేక కౌంటర్లు

భువనగిరి అర్బన్, జూలై 12 : ప్రజాపాలన దరఖాస్తులకు సంబంధించి యూఎస్‌సీ నంబర్ తప్పుగా ఉన్నా, ఇల్లు మార్చినా కొత్త ఇంటి నంబర్‌ను అప్‌డేట్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తులకు సంబంధించి యూఎస్‌సీ నంబర్ తప్పుగా ఉంటే విద్యుత్ జీరో బిల్లు రాదని, అందుకు యూఎస్‌సీ నంబర్ కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని, అప్పుడే విద్యుత్ బిల్లు జీరోగా వస్తుందని పేర్కొన్నారు. ఇందుకోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మహిపాల్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల పరామర్శ

లక్ష్మమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, నాయకులు

భూదాన్ పోచంపల్లి, జూలై 12 : మండలంలోని దేశ్‌ముఖి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు, భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యాల మహిపాల్‌రెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ (81) అనారోగ్యంతో మృతి చెందారు. జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, పలువురు నాయకులు శుక్రవారం ఆమె మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. మహిపాల్‌రెడ్డిని పరామర్శించి సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కోట పుష్పలత, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాల భూపాల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● రజక సంఘాల సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్ శ్రీధర్

మాట్లాడుతున్న రజక సంఘాల సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్ శ్రీధర్

యాదగిరిగుట్ట, జూలై 12 : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక సంఘాల సమన్వయ కమిటీ కో ఆర్డినేటర్ వడ్డెబోయిన శ్రీధర్ అన్నారు. యాదగిరిగుట్టలోని రజక సంఘం సభ్యులతో కలిసి శుక్రవారం మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టి కేంద్రానికి పంపించాలన్నారు. అసెంబ్లీలో రజకుల కోసం ప్రతిపక్ష హోదాలో రేవంత్‌రెడ్డి మాట్లాడారని గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నందున రజకుల అభివృద్ధిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ నమిలె రామచంద్రం, రజక సంఘం నాయకులు శ్రీశైలం, సాంబేశ్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

'ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్

భువనగిరి అర్బన్, జూలై 12 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తాలో ఇండియన్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టడంతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి కుటుంబం గడవలేని పరిస్థితి ఎదురైందన్నారు. ఆటో కార్మికుల కుటుంబాలకు ప్రతి నెలా రూ.10వేలు ఇచ్చే వరకూ ఆందోళనలు చేపడుతామని పేర్కొన్నారు. పట్టణంలోని ఆటోలకు పార్కింగ్ స్థలం లేదని, కొత్త బస్టాండ్ సమీపంలో పార్కింగ్ స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గనబోయిన వెంకటేశ్, నాయకులు లక్ష్మణ్, షరీఫ్, సల్మాన్, శ్రీను, చాంద్, అజయ్, జమీర్ పాల్గొన్నారు.

పోచంపల్లిలో మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భూదాన్ పోచంపల్లి, జూలై 12 : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం రెండో రోజు కొనసాగింది. తమ న్యాయమైన కోర్కెలను మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించేందుకు ఆయన హామీ ఇవ్వడంతో సమ్మె విరమించారు. అంతకుముందు కార్మికులు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఏరియర్స్ వెంటనే ఇవ్వాలని, పదేండ్లుగా విధులు నిర్వహిస్తున్న వారందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు కొండ భాస్కర్, ముత్తమ్మ, చంద్రకళ, శారద, గిరి, శంకర్, హరికృష్ణ, నరేశ్, కవిత, బాలస్వామి, రవి, సత్తయ్య, నరసింహ పాల్గొన్నారు.

ఆరెగూడెంలో వానలు కురువాలని చుట్టుకాముడు

ఆరెగూడెంలో చుట్టుకాముడు ఆడుతున్న మహిళలు

మోత్కూరు, జూలై 12 : మున్సిపాలిటీ పరిధిలోని ఆరెగూడెంలో వానలు కురువాలని కోరుతూ మహిళలు శుక్రవారం చుట్టుకాముడు ఆడారు. గ్రామంలోని మహిళలంతా నీళ్ల బిందెలతో వచ్చి వాన పాటలు పాడుతూ ఆడిపాడారు. అనంతరం బొడ్రాయికి జలాభిషేకం చేశారు.

చిన్నారులకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందన

సీఎం రేవంత్‌రెడ్డితో చిన్నారులు

భువనగిరి అర్బన్, జూలై 12 : భువనగిరి పట్టణానికి చెందిన ఆర్కే హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చావా రాజ్‌కుమార్, అశ్లేష దంపతుల కుమారుడు మాస్టర్ తారక్‌సందా, కుమార్తె ఆకృతిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. 2024 ఏప్రిల్ నెలలో ఢిల్లీలోని ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ కాన్వకేషన్‌లో ఇద్దరు చిన్నారులు పాల్గొని అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని తల్లిదండ్రులతో కలిసి వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తారక్‌సందా, ఆకృతికను ముఖ్యమంత్రి అభినందించారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు : డీఏఓ

ముశిపట్లలో జీలుగ సాగును పరిశీలిస్తున్న డీఏఓ అనూరాధ

మోత్కూరు, జూలై 12 : రైతులు పంటల మార్పిడి విధానం అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని డీఏఓ కె.అనూరాధ అన్నారు. మండలంలోని ముశిపట్ల గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తి, కంది, ఆయిల్ పామ్, జీలుగ పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట పంటలైన జీలుగ సాగు చేపట్టడం, పంట మార్పిడి చేయడం వల్ల వాయురూప నత్రజని వేరుబుడిపెలలో ఉండి యూరియా వాడకాన్ని 25శాతం వరకు ఆదా చేయవచ్చన్నారు. సూక్ష్మ పోషకాలు మరింతగా మొక్కలకు అందుతాయని తెలిపారు. తద్వారా పంట దిగుబడి పెరుగుతుందని చెప్పారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా కంది, పెసర సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. పత్తిలో అంతర పంటగా కంది, దోస సాగు చేయడం వల్ల మిత్ర పురుగుల సాంద్రత పెరిగి ప్రధాన పంటకు చీడపీడల నష్టాలను తగ్గించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ జె.సైదులు, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు వేతనాల చెల్లింపులో అలసత్వం తగదు

● ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ రిసోర్స్ పర్సన్ రవికుమార్

బొమ్మలరామారం, జూలై 12 : ఉపాధి హామీ పథకం కూలీలకు వేతనాల చెల్లింపులో అలసత్వం తగదని స్టేట్ రిసోర్స్‌పర్సన్ రవికుమార్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై ఆడిటింగ్, సమీక్ష నిర్వహించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు సంవత్సరంలో నిర్దేశించిన పని దినాల్లో పని కల్పించాలన్నారు. వేతనాలు వెంటవెంటనే చెల్లించాలని సూచించారు.

కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసర్ చండిరాణి, అంబుడ్స్‌మన్ వీరమల్లు, అదనపు డీఆర్‌డీఓ సురేశ్, ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, అదనపు ప్రోగ్రామ్ అధికారి శ్రీలక్ష్మి, ఇంజినీర్ కన్సల్టెంట్ పుష్పలత, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్థిక సాయం అందజేస్తున్న పీఏసీఎస్ బ్యాంకు మాజీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 12 : రైతుల సంక్షేమం కోసం బ్యాంకు ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చందుపట్ల బ్యాంకు మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్‌రెడ్డి అన్నారు. అనారోగ్యంతో మృతిచెందిన చందుపట్ల గ్రామానికి చెందిన సంఘం సభ్యురాలు చెంచారపు నర్సమ్మ(65) కుటుంబ సభ్యులకు సంఘం సభ్యుల డివిడెండ్ నిధి నుంచి రూ.30వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ సుబ్బూరు మహేందర్, సిబ్బంది గుర్రం నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడులు ఆపాలి : ఐలు

భువనగిరి అర్బన్, జూలై 12 : రాష్ట్రంలో న్యాయవాదులపై పోలీసులు, ఇతర మూకలు చేస్తున్న దాడులు ఆపాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన చట్టాల ప్రారంభంలోనే పోలీసులు అతి ఉత్సాహంతో చట్టాలను అతిక్రమిస్తున్నారన్నారు. పోలీస్ అధికార యంత్రాంగం సమీక్షలు నిర్వహించి పోలీసులకు గైడ్‌లైన్స్ విడుదల చేయాలని సూచించారు. చట్టాల అమలులో పోలీసులు, కోర్టులు, న్యాయవాదులు సమన్వయంతో మెలగాలని, పోలీస్ ఉన్నతాధికారులు అటువంటి డైరెక్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు.

సమావేశంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు కుక్కడువు సోమయ్య, యూనియన్ నాయకులు తడక మోహన్, బొల్లెపల్లి కిషన్, యాదయ్య, ఖయ్యూం పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : ఐఎఫ్‌టీయూ

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్

ఆలేరు రూరల్, జూలై 12 : చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాచకొండ జనార్దన్ అన్నారు. ఆలేరులోని టీఎన్‌యూ భవన్‌లో శుక్రవారం జరిగిన చేనేత కార్మికుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇవ్వాలన్నారు. నూలుపై 40శాతం రాయితీ ఇవ్వకుండా ప్రభుత్వం కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు. చేనేత వస్త్రాలకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆలేరు సిల్క్ సొసైటీ మాజీ అధ్యక్షుడు మురళి, ఆసు య